
# చైతన్యరథం



రేపు ఐదో దశ పోలింగ్
- ఆరు రాష్ట్రాల్లో 49 లోక్‌సభ సీట్లలో పోటీ
- బరిలో రాహుల్ గాంధీ, రాజ్‌నాథ్ సింగ్, స్మృతి ఇరానీ, చిరాగ్ పాశ్వాన్

5

# రంగంలోకి సిట్

- వినీత్ బ్రిజ్‌లాల్‌కు రిపోర్టు చేసిన సభ్యులు
- డీజీపీ గుప్తాతో సిట్ చీఫ్ వినీత్ భేటీ
- సౌమ్యలత నేతృత్వంలో తిరుపతికి బృందం
- హింసా ఘటనలపై క్షేత్రస్థాయి పరిశీలన
- నానిపై దాడిని రీ-కన్‌స్ట్రక్ట్ చేసిన బృందం
- అరెస్టుల భయంతో రాజకీయ నేతల పరార్
- చంద్రగిరిలో 144 సెక్షన్ కొనసాగింపు

[illegible]

2



## హింసాత్మక ఘటనలపై సిట్‌తో లోతైన దర్యాప్తు జరపాలి

- డీజీపీకి టీడీపీ నేత వర్ల రామయ్య లేఖ
- లేఖతోపాటు ఘటనల జాబితా



[illegible]

మిగతా 2వ...

## ఎన్నికల రక్తచరిత్ర
## పాపం జగన్‌రెడ్డిదే

ముఖ్యమంత్రి గతంపై దృష్టిపెట్టాలి
టీడీపీ నేత వర్ల రామయ్య

- ఎలక్షన్ కమిషన్‌పై బురద చల్లేందుకు కుట్ర
- ప్రభుత్వం పంపిన పేర్లనుండే అధికారులను నియమించిన ఈసీ
- హింసను అడ్డుకోలేని పోలీసు అధికారులను గుర్తించింది డీజీపీనే
- విధినిర్వహణలో విఫలమైన పోలీసు అధికారుల్లో సింహభాగం రెడ్లే
- పోలింగ్‌రోజు [illegible] పెద్దిరెడ్డి బ్రదర్స్‌ను అరెస్ట్ చేయాలి

3



## పల్నాడు కలెక్టర్‌గా లట్కర్ శ్రీకేశ్ బాలాజీ

- పల్నాడు ఎస్పీగా మల్లికా గార్గ్ - తిరుపతి ఎస్పీగా హర్షవర్ధన్
- అనంతపురం ఎస్పీగా గౌతమి శాలి



హర్షవర్ధన్



మల్లికా గార్గ్



గౌతమి శాలి

[illegible]

చైతన్యరథం

# రంగంలోకి సిట్

- ❑ వినీత్ బ్రిజ్‌లాల్‌కు రిపోర్టు చేసిన సభ్యులు
- ❑ డీజీపీ గుప్తాతో సిట్ చీఫ్ వినీత్ భేటీ
- ❑ సౌమ్యలత నేతృత్వంలో తిరుపతికి బృందం
- ❑ హింసా ఘటనలపై క్షేత్రస్థాయి పరిశీలన
- ❑ నానిపై దాడిని రీ-కన్‌స్ట్రక్ట్ చేసిన బృందం
- ❑ అరెస్టుల భయంతో రాజకీయ నేతల పరారీ
- ❑ చంద్రగిరిలో 144 సెక్షన్ కొనసాగింపు

అమరావతి (చైతన్య రథం): ఏపీలో పోలింగ్ అనంతరం చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై ఏర్పాటైన సిట్ రంగంలోకి దిగింది. ఎన్నికల హింసపై వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు ఆపరేషన్ మొదలుపెట్టింది. ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో 13మంది సభ్యులతో ప్రత్యేక బృందాన్ని శుక్రవారం నియమించిన వెంటనే సిట్ తన పని మొదలెట్టింది. నివేదిక కోసం ఈసీ ఇచ్చిన గడువు 48 గంటలే కావడంతో, దర్యాప్తులో దూకుడు చూపిస్తోంది. శుక్రవారం రాత్రి నుంచే దర్యాప్తు ప్రారంభించిన వినీత్ బ్రిజ్‌లాల్, తొలుత డీజీపీ హరీష్ కుమార్ గుప్తాతో భేటీ అయ్యారు. సిట్ కోసం ఎంపిక చేసిన సభ్యులు 13మంది శనివారం ఉదయమే వినీత్ బ్రిజ్‌లాల్ కు రిపోర్ట్ చేశారు. 13మంది సభ్యులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన వినీత్ బ్రిజ్‌లాల్, మూడు జిల్లాలకు మూడు బృందాలను నియమిస్తూ దర్యాప్తు కోణాన్ని నిర్దేశించినట్టు తెలుస్తోంది. అల్లర్లు జరిగిన ప్రాంతాలకు సిట్ టీమ్స్ వెళ్లినట్టు సిట్ చీఫ్ వినీత్ బ్రిజ్‌లాల్ శనివారం ఉదయం ప్రకటించారు. క్షేత్రస్థాయికి వెళ్లిన సిట్ బృందాలు, అక్కడ నమోదైన ఎఫ్‌ఐఆర్‌లను పరిశీలిస్తున్నట్టు వెల్లడించారు. కేసుల పురోగతి, అరెస్టులపై వివరాలు సేకరిస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు డీజీపీకి వివరాలు తెలియజేస్తామని వినీత్ బ్రిజ్‌లాల్ స్పష్టం చేశారు. ఇదిలావుంటే -క్షేత్రస్థాయికి వెళ్లిన సిట్ బృందాలు పల్నాడు, అనంతపురం, తిరుపతి జిల్లాల్లోని తాడిపత్రి, మాచర్ల, గురజాల, నరసరావుపేట, సత్తెనపల్లి, తిరుపతి హింసా ఘటనలపైనే ప్రధానంగా దృష్టిపెట్టినట్టు కనిపిస్తోంది. హింసా ఘటనల్లో రాజకీయ పక్షాల పాత్ర, హింసకు సహకరించిన పోలీస్ అధికారుల పాత్ర, ఘటనలపై నమోదైన ఎఫ్‌ఐఆర్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. శనివారం ఉదయానికే అదనపు ఎస్పీ సౌమ్యలత, డీఎస్పీ మనోహరాచారిలతో కూడిన సిట్ బృందమొకటి తిరుపతికి చేరింది. తిరుపతి పద్మావతి మహిళా వర్సిటీలో సిట్ అధికారులు విచారణ చేపట్టారు. తెలుగుదేశం అభ్యర్థి పులివర్తి నానిపై దాడి ఏరీతిన సాగిందో వివరాలు సేకరించి సీన్ రీ-కన్‌స్ట్రక్ట్ చేసి చూశారు. అలాగే, హింసాత్మక ఘటనలపై నమోదైన కేసుల వివరాలను స్థానిక పోలీసుల నుంచి సేకరించారు. కొన్ని కేసుల్లో నమోదైన ఎఫ్‌ఐఆర్‌ను సిట్ పునఃసమీక్షించనుంది. అవసరమైతే ఎఫ్‌ఐఆర్‌ను మార్చడం లేదా మరికొందరి పేర్లు నమోదు చేయనుంది. దర్యాప్తునకు వచ్చిన సిట్ బృందానికి అవసరమైన సమాచారం అందిస్తామని తిరుపతి ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. గత 14న జరిగిన సంఘటనలపై జిల్లా మేజిస్ట్రేట్‌గా ఇప్పటికే నివేదిక సమర్పించానని స్పష్టం చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల దగ్గర భద్రత కట్టుదిట్టం చేశామని, దర్యాప్తు బృందానికి ఎలాంటి సమాచారం కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉంటామని ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. ఇదిలావుంటే, దర్యాప్తులో దూకుడు చూపిస్తోన్న సిట్ బృందాలు.. ఎన్నికల అల్లర్లపై శనివారం రాత్రికే ప్రాథమిక నివేదికను సిద్ధం చేసి ఈసీకి నివేదించే అవకాశాలు కనిపిస్తున్నాయి. దర్యాప్తులో భాగంగా అల్లర్లతో సంబంధమున్న కొందరు రాజకీయ పార్టీ నేతలను సిట్ అరెస్టు చేసే అవకాశాలూ లేకపోలేదు. ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులపైనా సిట్ సీరియస్‌గానే ఫోకస్ పెట్టినట్టు కనిపిస్తోంది. హింసను ప్రేరేపించటంలో పాత్రవున్నా, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్టు తేలినా.. మొత్తంగా ఎన్నికల అనంతర హింసలో పోలీస్ అధికారులు పాత్రపైనా దర్యాప్తు చేస్తున్న సిట్, పోలీసుల పాత్రవుంటే గట్టి చర్యలకే సిఫార్సు చేయొచ్చని అంటున్నారు. సిట్ బృందంలో ఏసీబీ ఎస్పీ రమాదేవి, అడిషనల్ ఎస్పీ సౌమ్య లత, ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సీఐడీ డీఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీలు వి శ్రీనివాసరావు, రవి మనోహర చారి, ఇన్స్పెక్టర్లు భూషణం, వెంకట రావు, రామకృష్ణ, జీఐ శ్రీనివాస్, ఎస్ ప్రభాకర్, శివప్రసాద్‌లు ఉండటం తెలిసిందే. ఆదివారం సాయంత్రానికి ఎన్నికల కమిషన్‌కు సిట్ నివేదిక ఇవ్వాల్సి ఉంది.

### చంద్రగిరిలో 144 సెక్షన్ కొనసాగింపు



ఇదిలావుంటే, చంద్రగిరిలో 144 సెక్షన్ కొనసాగుతోంది. పోలింగ్ తర్వాత అలర్లకు సంబంధించి ఏడు కేసులు నమోదు చేశారు. వైపాకా, తెదేపా పార్టీల్లోని 40మందిని నిందితులుగా పోలీసులు గుర్తించారు. అరెస్టుల భయంతో వీరిలో కొందరు అజ్ఞాతంలోకి వెళ్లినట్టు తెలుస్తోంది. వర్సిటీ వద్ద దాడి ఘటనలో పాల్గొన్న వారిని గుర్తించే పనిలో పోలీసులున్నారు. పులివర్తి నానిపై దాడి కేసులో 13మందిని కడప సెంట్రల్ జైలుకు తరలించారు. ముఖ్యనేతల ఇళ్ల వద్ద పోలీస్ బందోబస్తు కొనసాగుతోంది.

### సిట్‌ను కలిసిన తెదేపా నేతలు

డీజీపీ కార్యాలయంలో సిట్ ఉన్నతాధికారులను తెలుగుదేశం పార్టీ నేతలు శనివారం కలిశారు. పోలింగ్ అనంతరం తలెత్తిన హింసాకాండపై వివరాలను పార్టీ తరపున సిట్ అధికారులకు అందించారు. వైసీపీ మూకలు హింసను ఎలా ప్రేరేపించాయి, దాడులకు పాల్పడిన ఆధారాలను పెన్‌డ్రైవ్‌లో సిట్ అధకారులకు అందించారు. ఈ సందర్భంగా ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా పారదర్శకంగా దర్యాప్తు జరపాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మీడియాతో మాట్లాడుతూ తిరుపతి, తాడిపత్రి, అనంతపురం, పల్నాడు ఘటనలపై సిట్‌కు ఫిర్యాదు చేస్తూ, వివరాలు అందించామన్నారు. మొత్తం 30 ఘటనల వివరాలను సిట్‌కు అందించామని చెబుతూ, చాలాకాలం తర్వాత స్వేచ్ఛగా డీజీపీ కార్యాలయానికి వచ్చామని వర్ల రామయ్య వ్యాఖ్యానించారు.

# హింసాత్మక ఘటనలపై సిట్‌తో లోతైన దర్యాప్తు జరపాలి

## - డీజీపీకి టీడీపీ నేత వర్ల రామయ్య లేఖ - లేఖతోపాటు ఘటనల జాబితా

మొదటి పేజీ తరువాయి..

**5.** రాజంపేట డీఎస్పీ చైతన్య నిబంధనలకు విరుద్ధంగా తాడిపత్రిలోకి ప్రవేశించి జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటిపైన దాడి చేశాడు. ఇంట్లో ఉన్న అందర్నీ గాయపరిచాడు. ఇతనిపై 23 ప్రయివేట్ కేసులు ఉన్నాయి. తన పాత కక్షలు తీర్చుకునేందుకే డీఎస్పీ చైతన్య నిబంధనలకు విరుద్ధంగా పని చేశాడు.

**6.** పెద్దాపురం నియోజకవర్గంలోని 4,5,6,7 పోలింగ్ బూతులలో వైసీపీ నేతలు గొడవలు సృష్టిస్తే డీఎస్పీ కె.లలిత కుమారి టీడీపీ కార్యకర్తలపై లాఠీఛార్జ్ చేసింది.

**7.** అన్నమయ్య జిల్లాలోని కోడూరు నియోజకవర్గంలోని దలవాయిపల్లె 192 పోలింగ్ బూత్‌లో వైసీపీ నేతలు గంగిరెడ్డి, ఎంపిపి బాబుల్‌రెడ్డి ఈవీఎంను డ్యామేజ్ చేయగా రాజంపేట డీఎస్పీ చైతన్య, సీఐ మంజునాథ్‌రెడ్డి, ఎస్ఐ రామ్మోహన్ కలిసి టీడీపీ కార్యకర్త మల్లు రాజారెడ్డిని రోజు స్టేషన్‌కు వచ్చి సంతకం చేసి వెళ్లాలని వేధిస్తున్నారు.

**8.** బనగానపల్లె నియోజకవర్గంలో 14 నెంబర్ పోలింగ్ బూత్‌లో టీడీపీ, వైసీపీ కార్యకర్తలు ఇద్దరూ ఘర్షణ పడగా సీఐ గోపీనాథ్‌రెడ్డి టీడీపీ కార్యకర్తలపై ఎస్‌సి,ఎస్‌టి కేసులు పెట్టి వేధిస్తున్నాడు.

**9.** బనగానపల్లె నియోజకవర్గంలోని బనగానపల్లె సర్కిల్‌లో ఎర్రగుడి గ్రామంలో పోలింగ్ ఏజెంట్లుగా క్రియాశీలంగా ఉన్నారని సర్పంచ్ వరలక్ష్మీ, ఆయన భర్త భాస్కర్‌రెడ్డిపై ఎస్‌సిఎస్‌టి చట్టం కింద తప్పుడు కేసులు పెట్టి ఎస్ఐ రామిరెడ్డి వేధిస్తున్నాడు.

**10.** పెనమలూరు నియోజకవర్గంలో 106 నెంబర్ బూత్‌లో టీడీపీ నేత వర్ల రాజేష్‌పై వైసీపీ కార్యకర్తలు దాడి చేసినప్పటికీ సీఐ టివిఎస్ రామారావు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

**11.** గూడురు నియోజకవర్గంలోని చిల్లకూరు సర్కిల్‌లో 114 నెంబర్ పోలింగ్ బూత్‌లో నిబంధనలకు విరుద్ధంగా మేరుగ మురళీ ప్రవేశించడాన్ని టీడీపీ ఏజెంట్ అడ్డుకోనగా అతన్ని ఎస్ఐ అంజిరెడ్డి బయటకు లాగి వైసీపీ కార్యకర్తలకు అప్పజెప్పగా..వారు దారుణంగా కొట్టారు.

**12.** సూళ్లూరు పేట నియోజకవర్గంలోని పెల్లకూరు సర్కిల్‌లో టీడీపీకి ఓటు వేశారని అరుణా అనే మహిళపైన వైసీపీ నేత కామిశెట్టి సత్యనారాయణరెడ్డి దాడి చేయగా ఎస్ఐ కుర్రా శ్రీకాంత్ టీడీపీ నేతలైన పేరం మధు నాయుడు, రమేష్ నాయుడులపై ఎస్‌సీ, ఎస్‌టీ కేసులు నమోదు చేసి వేధిస్తున్నాడు. సత్యనారాయణరెడ్డిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

**13.** సూళ్లూరుపేట నియోజకవర్గంలోని వజిలి టౌన్‌బూత్‌లో ఉన్న టీడీపీ ఏజెంట్ కటారు కోటేశ్వరరావును ఎస్ఐ రవిబాబు బయటకు లాగి రోజూ స్టేషన్‌కు రావాలంటూ వేధిస్తున్నాడు.

**14.** సజ్జలకు దగ్గర మనిషని చెప్పుకునే సూళ్లూరుపేట టౌన్‌కు చెందిన ఎస్ఐ కోటా రహీమ్ రెడ్డి పోలింగ్ రోజు అన్ని బూతుల్లోని టీడీపీ ఏజెంట్లపైన ఎటువంటి కారణం లేకుండా దాడులు చేశాడు.

**15.** బొబ్బిలి నియోజకవర్గంలో కన్నం నాయుడు, నరేంద్రలపై వైసీపీ కార్యకర్తలు ఆయుధాలతో దాడి చేసి రక్తం వచ్చేలా గాయాలు చేయగా సీఐ నాగేశ్వరరావు వారిపై సెక్షన్ 109, 232, 341 కింద కేసులు నమోదు చేయలేదు.

**16.** కొత్తపేట నియోజకవర్గంలోని ఆత్రేయపురం గ్రామంలోని 25, 26నెంబర్ల పోలింగ్ బూత్‌లలో వైసీపీ, టీడీపీ కార్యకర్త లిద్దరూ ఘర్షణ పడగా ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ వైసీపీ కార్యకర్తలను మాత్రం వదిలేసి టీడీపీ కార్యకర్తలపై జులుం ప్రదర్శించారు.

**17.** కందుకూరు నియోజకవర్గంలో కృష్ణపురం గ్రామంలోని 257 పోలింగ్ బూత్‌లో ఎస్ఐ బాజీ రెడ్డి వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేశాడు.

**18.** గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గం తెనాలి టౌన్ సీఐ సుధాకర్: పోలింగ్ బూత్‌లో ఎమ్మెల్యే శివకుమార్, ఆయన మనుషులు ఒక ఓటరుపై చెయ్యి చేసుకుంటే ఈ సీఐ.. బాధితుడినే పోలీసు స్టేషన్‌లో నిర్బంధించాడు. గాయపడిన బాధితుడిని హాస్పిటల్‌కు కాకుండా పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లడమేమిటి?

**19.** గుంటూరు ఎస్పీ తుషార్: గుంటూరు వెస్ట్ నియోజకవర్గంలో సజ్జల రామకృష్ణారెడ్డికి సన్నిహితుడిగా చెప్పుకునే ఒక ఎస్ఐ పోలింగ్ బూత్‌ల వద్ద అకారణంగా టీడీపీ కార్యకర్తలను కొట్టి తరిమేసినా చర్యలు తీసుకోలేదు. నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో పోలింగ్‌లో అక్రమాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వచ్చినా ఎస్పీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

**20.** గుంటూరు వెస్ట్ నియోజకవర్గం గుంటూరు టౌన్ సీఐ వెంకటేశ్వరరెడ్డి: సాయి ఆదిత్య స్కూలు పోలింగ్ స్టేషన్‌ను వైసీపీ అభ్యర్థి విడదల రజని సందర్శించిన సమయంలో టీడీపీ ఏజెంట్లను బలవంతంగా బయటకి పంపించి, పోలింగ్‌లో అక్రమాలకు కారణమయ్యారు.

**21.** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం చంద్రగిరి డీఎస్పీ సీఐ సీ శరత్ రాజకుమార్: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో వైసీపీ మూకలు దాడిలో బాధితులైన టీడీపీ కార్యకర్తలపైనే కేసులు పెట్టారు

**22.** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం తిరుచానూరు సీఐ శ్రీకాంత్‌రెడ్డి: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో చంద్రగిరి టీడీపీ అభ్యరికథ పులివర్తి నానిపై జరిగిన దాడిలో బాధితులైన టీడీపీ కార్యకర్తలపైనే కేసులు పెట్టారు.

**23.** పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం, మాచర్ల అర్బన్ ఎస్ఐ కీలం అరుణ: సీపీఎఫ్ బలగాల కదలికలపై ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి సమాచారం అందించారు. తద్వారా పోలింగ్ రోజు హింసకు కారణమయ్యారు.

**24.** పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం, మాచర్ల రూరల్ ఎస్ఐ కుర్రి రాజశేఖర్: ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరించాడు. పోలింగ్ రోజు ఘర్షణలకు కారకుడు.

**25.** చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం, బంగారుపాళ్యం సీఐ యు. లక్ష్మయ్య: నలగంపల్లి గ్రామంలో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగితే, ఆ ప్రదేశంలోనే లేని టీడీపీ కార్యకర్తలు జయప్రకాష్, విక్రం, లోకేష్‌పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం కింది కేసులు పెట్టాడు.

**26.** చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం, చిత్తూరు రూరల్ సీఐ సురేష్‌రెడ్డి: మాదిరెడ్డిపల్లె పోలింగ్ స్టేషన్‌లో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య గొడవ జరిగితే టీడీపీ కార్యకర్తలపై హత్యాయత్నం కేసులు ( సెక్షన్ 307) పెట్టాడు.

**27.** పల్నాడు జిల్లా నర్సరావుపేట ఎస్ఐ కే రవీంద్ర పాల్: గ్రామాల్లో విస్తృతంగా తిరిగి ఓటు వేసేందుకు వెళ్లవద్దంటూ టీడీపీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేశాడు.

**28.** పల్నాడు నర్సరావుపేట ఎస్ఐ ఎం రోశయ్య: టీడీపీ కార్యకర్తలను ఓటింగ్‌లో పాల్గొనకుండా అడ్డుకునే బాధ్యతను తన భుజాలమీద వేసుకున్నాడు

**29.** పల్నాడు జిల్లా నర్సరావుపేట వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి: పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించాడు. ప్రతిరోజూ టీడీపీ కార్యకర్తలను పోలీసుస్టేషన్‌కు పిలిపించి వేధింపులకు గురిచేశాడు

**30.** పల్నాడు జిల్లా నర్సరావుపేట రూరల్ సీఐ అవుల భాస్కర్ : పోలింగ్ ముగిసిన తరువాత కూడా టీడీపీ కార్యకర్తలను వేధిస్తూనే ఉన్నాడు. రోజూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకాలు పెట్టి వెళ్లాలని తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నాడు.

# ఎన్నికల రక్తచరిత్ర పాపం జగన్‌రెడ్డిదే

## - ముఖ్యమంత్రి గతంపై ధ్వజమెత్తిన తెదేపా నేత వర్ల రామయ్య

- ఎలక్షన్ కమిషన్‌పై బురద చల్లేందుకు కుట్ర
- ప్రభుత్వం పంపిన పేర్లనుండే అధికారులను నియమించిన ఈసీ
- హింసను అడ్డుకోలేని పోలీసు అధికారులను గుర్తించింది డీజీపీనే
- విధినిర్వహణలో విఫలమైన పోలీసు అధికారుల్లో సింహభాగం రెడ్లే
- హౌస్‌అరెస్ట్ నుంచి పరారైన పిన్నెల్లి బ్రదర్స్‌ను అరెస్ట్ చేయాలి
- హింసాత్మక ఘటనలపై సిట్ లోతైన విచారణ చేయాలి



అమరావతి(చైతన్యరథం): ఓడిపోతున్నామని తెలిసి, రాష్ట్రంలో రక్తపాతం సృష్టించైనా సరే గెలవాలనే కుట్రతో వైసీపీ నేతలు విధ్వంసం సృష్టించారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య విమర్శించారు. టీడీపీ నేతలు, టీడీపీ సానుకూల ఓటర్లపై మారణాయుధాలతో దాడులకు దిగి చంపేందుకు ప్రయత్నించారన్నారు. ఈ విధ్వంసానికి పాల్పడిన వైసీపీ నేతలను వెంటనే అరెస్ట్ చేసి, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ రెడ్డి తీరు దొంగే.. దొంగా దొంగా అని అరిచినట్లుగా ఉందన్నారు. జగన్‌రెడ్డి గత చరిత్ర మొత్తం హింసతో నిండిపోయి ఉందన్నారు. చేయాల్సిన హింసాకాండ మొత్తం జరిపించి, ఎలక్షన్ కమిషన్‌పై బురద చల్లేందుకు జగన్‌రెడ్డి యత్నిస్తున్నాడు. ఓడిపోతున్నామన్న ఫ్రస్టేషన్‌లో జగన్ రెడ్డి అరాచకం సృష్టించాడు. రాష్ట్రం పంపిన ప్రతిపాదనల నుండే అధికారులను ఎలక్షన్ కమిషన్ నియమించింది. ఆ అధికారులు సరిగ్గా పనిచేయడంలేదని వారిపై చర్యలు తీసుకోవాలని ఈసీని కోరింది కూడా డీజీపీనే అని వర్ల రామయ్య గుర్తుచేశారు.

### కులం పేరుతో తప్పుదోవ పట్టించే యత్నం

గతంలో 2019 ఎన్నికల ముందు ఒకే రోజు డీజీపీ, చీఫ్ సెక్రటరీ, ఇంటిలిజెన్స్ డీజీతో పాటు పలువురు ఎస్పీలను తొలగిస్తే ఎలక్షన్ కమిషన్ చర్యలు భేష్ అని జగన్ రెడ్డి మెచ్చుకున్నది నిజం కాదా? చంద్రబాబు హయాంలో ముగ్గురు కమ్మ కులం అధికారులు ఉంటే 33 మంది డీఎస్పీలను నియమించుకున్నారని జగన్ రెడ్డి గగ్గోలు పెట్టాడు. మళ్లీ జగన్ రెడ్డే ముగ్గురు కమ్మకులం అధికారులు మాత్రమే ఉన్నారని శాసనసభలో నిజం అంగీకరించారు. నేడు అసమర్థ ఆఫీసర్లను తొలగిస్తే ఎన్నికల కమిషన్‌పై జగన్ రెడ్డి దాడి చేస్తున్నాడు. 12 మంది డీఎస్పీ, దిగువస్థాయి పోలీసు అధికారులను సస్పెండ్ చేసి శాఖాపరమైన విచారణను చేపట్టేందుకు డీజీపీ.. ఎన్నికల సంఘం అనుమతి కోరారు. విధినిర్వహణలో విఫలమైన పోలీసు అధికారుల్లో సింహభాగం రెడ్డి కులస్థులే ఉన్నారు. వాస్తవం ఇలాఉంటే సస్పెన్షన్‌కు గురైన పల్నాడు జిల్లా ఎస్పీ కులం పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని జగన్ బృందం కుటిల ప్రయత్నం చేస్తోంది. మాజీ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, ఇంటిలిజెన్స్ అడిషనల్ డీజీ ఆంజనేయులు, కొల్లి రఘురామరెడ్డి, సీఎస్ జవహర్ రెడ్డి, సీఎంఓ అధికారి ధనుంజయ్‌రెడ్డిలు పోలింగ్ రోజున ఎక్కడ ఉన్నారు? అందరూ కలిసి జగన్ గెలుపునకు కుట్ర పన్నింది నిజం కాదా? రాష్ట్రంలో రక్తపాతానికి కుట్రలు చేసింది వీరే.. వీరి కాల్‌డేటా బయటకు తీస్తే అంతా బయటకు వస్తుందని వర్ల అన్నారు.

### వెంటనే అరెస్ట్ చేయాలి

మాచర్లలో నరమేధానికి కారకులైన ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డిలను వెంటనే అరెస్ట్ చేయాలి. అరాచకం సృష్టించి హౌస్ అరెస్ట్ అయిన మాచర్ల ఎమ్మెల్యే, అతని సోదరుడు తాడేపల్లి ప్యాలెస్‌కు వచ్చి జగన్ రెడ్డి సూచనలతో రాష్ట్రం విడిచి పారిపోయారు. చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిపై చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిలు హత్యాయత్నం చేశారు. వీరిని వెంటనే అరెస్ట్ చేయాలి. తాడిపత్రిలో కేతిరెడ్డి పెద్దారెడ్డి సృష్టించిన అరాచకం, విధ్వంసానికి అతన్ని వెంటనే అరెస్ట్ చేయాలి. రాజంపేట డీఎస్పీ చైతన్యకు తాడిపత్రిలో పని ఏంటి... జేసీ ప్రభాకర్ రెడ్డి ఇల్లు ధ్వంసం చేసి దివ్యాంగుడిపై దాడి చేయడం చాలా బాధాకరం... అతన్ని వెంటనే అరెస్ట్ చేయాలి. అధికారాన్ని వదులుకోవడం ఇష్టం లేక జగన్ రెడ్డి రక్త చరిత్రకు తెరలేపాడు. మాజీ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, అడిషనల్ డీజీపీ సీతారామాంజనేయులు, ఐజీ కొల్లి రఘురామిరెడ్డి పన్నిన కుట్రను సిట్ దర్యాప్తులో వెలికితీసి హింసకు కారకులైన వైసీపీ నేతలను జైలుకు పంపాలి. జగన్ రెడ్డి నేర చరిత్రపై బ్రిటన్ లోని ఓ యూనివర్సిటీలో చర్చకు వచ్చిందంటే జగన్ రెడ్డి ఎంత అవినీతి పరుడో రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకున్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా గెలుపు కూటమిదే. ప్రజలు అరాచక పాలనను తరిమికొట్టేందుకే పోటెత్తి వచ్చి ఓట్లు వేశారని వర్ల స్పష్టం చేశారు.

### సీసాలు, క్యాన్లలో పెట్రోల్ విక్రయాలు బంద్

విజయవాడ: రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో ఎన్నికల హింస చెలరేగటం, పెట్రోల్ బాంబులు బయటపడ్డ నేపథ్యంలో ఎన్నికల సంఘం అప్రత్తమయింది. పెట్రోల్ బంకుల్లో విడి అమ్మకాలను నిషేధించింది. అంటే వాహనాలక మాత్రమే పెట్రోల్ నింపుతారు. సీసాలు, క్యాన్లలో పెట్రోల్ నింపవద్దని ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్ని పెట్రోల్ బంకులకు స్థానిక పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

## అగ్రిగోల్డ్ భూముల్లో కలప దొంగలు

### అక్రమంగా తరలిస్తున్న వైసీపీ నేతలు

నెల్లూరు: అగ్రిగోల్డ్ భూముల్లో కలపను వైసీపీ నేతలు దోచేస్తున్నారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం, దుత్తలూరు మండలం రాచవారిపల్లి ప్రాంతంలోని అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ చెట్లను అక్రమంగా నరికేసి తరలిస్తున్నారు. వారానికి అయిదు లారీల జామాయిల్ కలపను అక్రమంగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. 200 ఎకరాల అగ్రిగోల్డ్ భూముల్లో రూ.50 లక్షల కలప మాయమైందంటే ఆ పార్టీ నేతలు ఏ స్థాయిలో అక్రమాలకు తెరదీస్తున్నారో అర్థమవుతుంది. దీనిపై ఫిర్యాదులు అందుతున్నా, అధికారులు పట్టించుకోవటంలేదు. 2019 ఎన్నికలకు ముందు అగ్రిగోల్డ్ బాధితులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన జజగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోలేదు. అగ్రిగోల్డ్ బాధితులకి అన్యాయం చేసిన జగన్ ప్రభుత్వం అగ్రిగోల్డ్ ఆస్తులు కాపాడటంలోనూ విఫలమయింది.

# కూటమి ప్రభుత్వంతో ఎస్సీ, ఎస్టీలకు మంచి రోజులు

## - టీడీపీ గిరిజన నేత మేడా రామకృష్ణ



అమరావతి(చైతన్యరథం): జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రజలు ఎన్నో అవస్థలు పడ్డారని..త్వరలో ఏర్పడనున్న కూటమి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలకు మంచి రోజులు రానున్నాయని తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా రామకృష్ణ ఆశాభావం వ్యక్తం చేశారు. ఐదేళ్ల పాలనలో తీసుకున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలే జగన్ రెడ్డి ప్రభుత్వాన్ని కూల్చబోతున్నా యన్నారు. జగన్ పాలనలో అన్ని విధాల నష్టపోయిన రాష్ట్రం బాగుపడి అభివృద్ధి చెందాలంటే అది కేవలం చంద్రబాబు నాయుడి పాలనతోనే సాధ్యమన్నారు. ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్న జగన్ రెడ్డికి ఇవే చివరి ఎన్నికలని, ఫలితాలకు ముందే జగన్ రెడ్డి చాపచుట్టేయడం చూస్తుంటే పరోక్షంగా ఓటమిని ఒప్పుకున్నట్లేనన్నారు. పెట్టేబేడా సర్దుకుని విదేశాలకు పారిపోయిన జగన్ రెడ్డి తీరు చూస్తుంటే మరలా స్వదేశానికి తిరిగి వచ్చేలా కనిపించడం లేదని, విదేశాలకు పారిపోయి జైలు జీవితం తప్పించుకోవాలని చూస్తున్నాడని ఎద్దేవా చేశారు. పోలింగ్‌కు ముందు, తరువాత రెచ్చిపోయి జే-గ్యాంగ్ చేసిన దాడుల్లో దళిత, గిరిజనులే బలయ్యారు. ఐదేళ్లుగా ఎస్సీలు, ఎస్టీలపై నిరంతరాయంగా సాగిన దాడులు, హత్యలు, అత్యాచారాలకు జగన్ రెడ్డే కారణం. దళిత, గిరిజనులపై దాడులకు పాల్పడ్డవారిని న్యాయస్థానాల ముందు నిలబెడతామని, జగన్‌రెడ్డి రాజకీయ హింసకు బలైపోయిన దళిత, గిరిజనులకు రాబోయే ప్రభుత్వంలో న్యాయం చేస్తామని తెలిపారు. పెత్తందారీతనం, ప్రజాస్వామ్య వ్యతిరేకత, అధికార లాలస.. ఎన్నికల అనంతర హింసకు, రక్తపాతానికి కారణమన్నారు. దీనికి వ్యతిరేకంగా ఈ ఎన్నికల్లో ప్రజలు తిరుగుబాటు చేశారని.. జగన్ రెడ్డికి భారీ ఓటమి తథ్యమని రామకృష్ణ అన్నారు.

# రేపు ఐదో దశ పోలింగ్

## - ఆరు రాష్ట్రాల్లో 49 లోక్‌సభ సీట్లలో పోటీ
## - బరిలో రాహుల్ గాంధీ, రాజ్‌నాథ్ సింగ్, స్మృతి ఇరానీ, చిరాగ్ పాశ్వాన్

**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా జరుగుతున్న సాధారణ ఎన్నికల్లో భాగంగా సోమవారం నాడు ఆరు రాష్ట్రాల్లోని 49 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ జరగనుంది. మొత్తం 695 మంది అభ్యర్థులు 49 స్థానాల్లో పోటీపడుతున్నారు. ఇప్పటికే నాలుగు దశల్లో పోలింగ్ ముగియగా ఈ ఐదవ దశలో ఉత్తరప్రదేశ్‌లో 14, మహారాష్ట్రలో 13, పశ్చిమబెంగాల్లో ఏడు, బీహార్‌లో 5, ఒడిస్సాలో 5, జార్ఖండ్‌లో 3, జమ్ము కశ్మీర్, లఢక్‌లలో ఒక్కొ స్థానానికి చొప్పున ఎన్నికలు జరగనున్నాయి. ఒడిస్సాలో 35 అసెంబ్లీ స్థానాలకు కూడా సోమవారం నాడే పోలింగ్ జరగనుంది. ఉత్తరప్రదేశ్‌లో రాయబరేలిలో ఓటింగ్ జరగనుండగా ఈసారి రాహుల్ గాంధీ పోటీలో ఉన్నారు. గత ఎన్నికల్లో ఇక్కడి నుండి సోనియా గాంధీ గెలవగా...ఆమె ఈ ఎన్నికల్లో పోటీ చేయకుండా సీటు రాహుల్ గాంధీకి కేటాయించింది. అలాగే ఆమేథి నుండి కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ పోటీలో ఉన్నారు. అదే విధంగా లక్నో నుండి కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బరిలో ఉన్నారు. ఇక బీహార్‌లో హాజీపూర్ నుండి చిరాగ్ పాశ్వాన్ బరిలో నిలిచారు. జమ్ముకాశ్మీర్‌లోని బారాముల్లా నుండి నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా పోటీలో ఉన్నారు. అలాగే బీహార్‌లోని సరెన్ నుండి లాలూ ప్రసాద్ యాదవ్ కూతురు రోహిణి



ఆచార్య బరిలో ఉన్నారు. ముంబయి నార్త్ నుండి కేంద్ర మంత్రి పియూష్ ఘోయల్ పోటీ పడుతున్నారు. మొదటి నాలుగు దశలో దేశ వ్యాప్తంగా 66 శాతం పోలింగ్ నమోదయింది. అయితే నాలుగో దశలో అత్యధిక పోలింగ్ జరిగింది. ఈ దశలో 69.16 శాతం పోలింగ్ నమోదయింది. దీనికి ప్రధాన కారణం తెలుగు రాష్ట్రాల్లో అత్యధికంగా ఓటింగ్ జరిగింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో 81.86 శాతం పోలింగ్ నమోదయ్యింది.

# గవర్నర్‌పై వేధింపుల కేసు..

## - ముగ్గురు రాజ్‌భవన్ ఉద్యోగులపై ఎఫ్ఐఆర్



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద్ బోస్‌పై లైంగిక వేధింపుల ఫిర్యాదు ఇచ్చేందుకు ప్రయత్నించిన ఓ మహిళా ఉద్యోగిని అడ్డుకున్న కేసులో రాజ్‌భవన్‌కు చెందిన ముగ్గురు ఉద్యోగులపై ఇవాళ కోల్‌కతా పోలీసులు కేసు బుక్ చేశారు. ఈ కేసులో ముగ్గుర్నీ నిందితులుగా చేర్చారు. గుర్తించినవారిలో ఓఎస్డీ ఎస్ఎస్ రాజ్‌పుత్, ప్యూన్ సంత్ లాల్, కుసుమ్ ఛత్రీలు ఉన్నారు. మే 2వ తేదీన ఈ ముగ్గురూ రాజ్‌భవన్‌లో పనిచేస్తున్న ఓ మహిళను నియంత్రించే ప్రయత్నం చేశారు. వీరిపై ఐపీసీ సెక్షన్ 341, 166 కింద కేసు బుక్ చేశారు. రాజ్‌భవన్‌లో కాంట్రాక్టు ఉద్యోగం చేస్తున్న మహిళ ఫిర్యాదు ఇచ్చేందుకు ప్రయత్నించిన సమయంలో ఆమెను అడ్డుకున్నారు. సెక్షన్ 164 కింద మెజిస్ట్రేట్ ముందు ఆ బాధితురాలి స్టేట్మెంట్‌ను రికార్డు చేశారు.

# కులశేఖర పట్టణంలో 'స్పేస్ పార్క్'..

## - ఇస్రోతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం



**చెన్నై:** తూత్తుకుడి జిల్లా కులశేఖర పట్టణంలో భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం ఏర్పాటుకానున్న చోట 1,500 ఎకరాల్లో 'స్పేస్ పార్క్' నిర్మాణం కానుంది. ఇందు కోసం ఇస్రోతో తమిళనాడు ప్రభుత్వ నిర్వహణలోని 'టిడ్కో' ఒప్పందం కుదుర్చుకుంది. అంతరిక్ష శాఖలో అగ్రదేశాలైన అమెరికా, రష్యా, చైనా తదితర దేశాలకు ధీటుగా భారత్ కూడా వేగంగా అభివృద్ధి పథంలోకి దూసుకెళ్తోంది. ఒకప్పుడు అమెరికా, చైనా, ఐరోపా దేశాలు అంతరిక్ష ప్రయోగంలో ముందుండేవి. ప్రస్తుతం చైనా శాస్త్రవేత్తలు కూడా ఈ ప్రయోగాలు చేపట్టారు. భారత్‌లో 1983వ సంవత్సరం నుంచి అంతరిక్షంలోకి రాకెట్ల ప్రయోగం ప్రారంభమైంది. ప్రస్తుతం భారత్‌లో నెల్లూరు జిల్లా శ్రీహరికోట వద్ద బంగాళాఖాతం తీరంలో మాత్రమే రాకెట్ ప్రయోగ కేంద్రం అందుబాటులో ఉంది.

ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో సముద్రతీర ప్రాంతం ఉన్న తూత్తుకుడి జిల్లా కులశేఖర పట్టణంలో అంతరిక్ష ప్రయోగ కేంద్రాన్ని ఏర్పాటుచేసే చర్యలు చేపట్టింది. 2,233 ఎకరాల్లో రూ.950 కోట్లతో నిర్మించనున్న ఈ కేంద్రం శంకుస్థాపన ఫిబ్రవరి 28న ప్రధాని నరేంద్ర మోదీ చేశారు. ఇదిలా ఉండగా, ఈ కేంద్ర ప్రాంగణంలోనే స్పేస్ పార్క్ ఏర్పాటుచేసేందుకు రాష్ట్రప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ మెగా ప్రాజెక్ట్ కోసం ఇస్రోతో టిడ్కో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ స్పేస్ పార్క్ అందుబాటులోకి వస్తే రాకెట్లకు అవసరమైన విడిభాగాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు తయారుచేయవచ్చని, స్పేస్ పార్క్‌కు అవసరమైన స్థలాన్ని సేకరించే పనులు వేగవంతం చేసినట్లు టిడ్కో అధికారులు తెలిపారు.

# నేరం రుజువైతే ప్రజ్వల్‌పై చర్యలు తీసుకోండి

## – సెక్స్ స్కాండల్ కేసుపై దేవె గౌడ





**ఢిల్లీ :** కర్ణాటకలో జేడీఎస్ ఎంపీ, మాజీ ప్రధాని దేవె గౌడ మనవడు ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్ స్కాండల్ కేసు దేశవ్యాప్తంగా సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నేడు 92వ పుట్టినరోజు జరుపుకుంటున్న దేవెగౌడ తన మనవడు ప్రజ్వల్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై తొలిసారి స్పందించారు. నేరం రుజువైతే ప్రజ్వల్‌పై చర్యలు తీసుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. అయితే, లైంగిక వేధింపులు, మహిళ కిడ్నాప్ ఆరోపణలు ఎదుర్కొంటున్న తన కుమారుడు జేడీఎస్ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణపై మాత్రం తప్పుడు కేసులు పెట్టారని మాజీ ప్రధాని ఆరోపించారు.

'ఈ కేసు కోర్టు పరిధిలో ఉన్నందున దీనిపై నేను మాట్లాడదల్చుకోలేదు. ప్రజ్వల్ రేవణ్ణ విదేశాలకు వెళ్లిపోయాడు. నేరం రుజువైతే ప్రజ్వల్‌పై చర్యలు తీసుకోవడానికి మా నుంచి ఎలాంటి అభ్యంతరం లేదు. బాధిత మహిళలకు న్యాయం జరగాలి. నష్ట పరిహారం అందించాలి. కానీ రేవణ్ణపై వచ్చిన ఆరోపణలపై ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలి. ఈ కేసులను ఎలా సృష్టించారో చూడాలి. ఒకే కేసులో కొందరికి బెయిల్ ఇచ్చారు. రేవణ్ణ విషయంలో సోమవారం తీర్పు వెలువడే అవకాశం ఉంది' అని దేవె గౌడ అన్నారు. ఈ కేసు గురించి హెచ్‌డి కుమారస్వామి తమ కుటుంబం మొత్తం తరపున మాట్లాడారని దేవె గౌడ తెలిపారు. జరిగినదంతా పరిశీలిస్తే తమ కుటుంబం పరువు తీసేందుకు, రాజకీయంగా దెబ్బతీసేందుకు కుట్ర జరిగినట్లు అనిపిస్తోందన్నారు. ఈ కుట్రలో చాలా మంది ప్రమేయం ఉందని వారి పేర్లను ప్రస్తావించదల్చుకోలేదని దేవె గౌడ పేర్కొన్నారు. ఎవరి ప్రమేయం ఉన్నా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 'దేవరాజే గౌడ ఏం మాట్లాడారో మీడియాలో చూశాం. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా కుమారస్వామి వీటన్నింటిపై చురుగ్గా స్పందిస్తున్నారు. అన్ని విషయాలపై ఆయనే మాట్లాడతారు. ఈ సమయంలో నేను ఏమీ వ్యాఖ్యానించలేను' అని దేవె గౌడ అన్నారు.

# యువత ఆలయాలబాట పట్టడానికి..

## ఇస్రో చైర్మన్ ఆసక్తికర సలహా



**తిరువనంతపురం:** నానాటికీ ఆలయాలకు వచ్చే యువత సంఖ్య తగ్గిపోతోందని ఇస్రో ఛైర్మన్ ఎస్ సోమనాథ్‌ఆవేదన వ్యక్తం చేశారు. తిరువనంతపురంలోని శ్రీ ఉదియనూర్ దేవీ ఆలయంలో ఇస్రో మాజీ చైర్మన్ మాధవన్ నయ్యర్ చేతుల మీదుగా ఆయన శనివారం ఓ అవార్డు అందు కున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "ఆలయాలు.. వయసుపైబడిన వారు వచ్చి ఆరాధనలు చేసుకోవడానికే కాదు. సమాజాన్ని మార్చే శక్తి గుడులకు ఉంటుంది. దేశవ్యాప్తంగా ఉన్న ఆలయాలకు యువతను రప్పించాలి. నా అవార్డు ప్రదాన కార్యక్రమంలో వారు ఎక్కువగా కనిపించట్లేదు. వారిని ఆకర్షించడానికి ఆలయాల్లో గ్రంథాలయాలు ఎందుకు పెట్టకూడదు? పుస్తకాలు చదివే ఆసక్తి ఉన్నవారు ఆలయాల బాట పడతారు. పుస్తకాలు చదివి జ్ఞానసంపద పెంచుకుని, ఉన్నతమైన జీవితానికి బాటలు వేసుకుంటారు. ఆలయ సిబ్బంది లైబ్రరీలను అందుబాటులోకి తెస్తే ఎన్నో మార్పులు చూడవచ్చు" అని సోమనాథ్ ఆసక్తికర సలహా ఇచ్చారు.

# ఢిల్లీ సీఎం సహాయకుడు బిభవ్ కుమార్ అరెస్ట్





**ఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఎంపీ స్వాతి మాలివాల్‌పై దాడి కేసులో ఢిల్లీ పోలీసులు చర్యలు తీసుకున్నారు. తనపై ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్ దాడి చేశారని స్వాతి మాలివాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ కేసులో ఢిల్లీ పోలీసులు బిభవ్ కుమార్‌ను ఈ రోజు (శనివారం) అరెస్ట్ చేశారు.

**ఏం జరిగిందంటే..?**

ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్టై బెయిల్ మీద బయటకు వచ్చిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను కలిసేందుకు స్వాతి మాలివాల్ ఇంటికెళ్లారు. ఆ సమయంలో కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్ తనపై దాడి చేశాడని ఆరోపణలు చేశారు. కుర్చీలో కూర్చొన్న తనపై బిభవ్ కుమార్ విచక్షణరహితంగా దాడి చేశారని, కాలితో తన్నారని ఆరోపించారు. ఆ తర్వాత బిభవ్ కుమార్‌పై పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టారు. ఆ కేసు ఆధారంగా బిభవ్ కుమార్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు.

**డైలాగ్ వార్**

స్వాతి మాలివాల్ ఘటన ఆప్, బీజేపీ మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. స్వాతి చేత బీజేపీ మాట్లాడిస్తోందని ఆప్ ఆరోపించింది. ఆప్ నేతల ఆరోపణలను బీజేపీ నేతలు ఖండించారు. ఆ రోజు ఏం జరిగిందో తెలియజేసేందుకు ఓ వీడియో విడుదల చేసింది. కేజ్రీవాల్ ఇంటి బయట రికార్డైన ఓ వీడియోను రిలీజ్ చేసింది. ఆ వీడియోలో కేజ్రీవాల్ నివాసం నుంచి బయటకు వస్తోన్న స్వాతి మాలివాల్ స్పష్టంగా కనిపించారు. బయటకు వచ్చే సమయంలో మహిళ సెక్యూరిటీ సిబ్బంది ఆమె చేయి పట్టుకొని కనిపించారు. మెయిన్ రోడ్డు మీదకు వచ్చిన తర్వాత ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. తర్వాత కూడా ఓ పోలీస్ అధికారి రాగా.. అతనితో స్వాతి మాలివాల్ మాట్లాడారు.

# రణరంగంగా తైవాన్ పార్లమెంట్



## - పిడిగుద్దులు గుద్దుకున్న ఎంపీలు

తైవాన్ పార్లమెంట్ రణరంగాన్ని తలపించింది. శుక్రవారం ఉదయం సభలో ఎంపీలు తన్నుకున్నారు. స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి గందరగోళం సృష్టించారు. ఒకరిపై ఒకరు పిడిగుద్దులతో దాడి చేసుకున్నారు. ఉదయం సభ ప్రారంభమైనప్పటి నుంచి మధ్యాహ్నం వరకూ వాదోపవాదాలు, నినాదాలతో సభ దద్దరిల్లింది. మధ్యాహ్నం తర్వాత కొంత మేర సద్దుమణిగినా తిరిగి మళ్లీ అదే పరిస్థితికి వచ్చింది.ప్రభుత్వ చర్యలను పర్యవేక్షించే చట్ట సభ్యులకు మరిన్ని అధికారాలు ఇచ్చేందుకు సంబంధించిన ప్రతిపాదనపై చర్చ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఎంపీలు స్పీకర్ చుట్టూ చేరి గందరగోళం సృష్టించారు. టేబుళ్లపైకి ఎక్కి దూకడం, సహచర సభ్యులను బెంచీలపై నుంచి కిందకు తోసేయడం వంటి ఘటనలతో సభ యుద్ధ వాతావరణాన్ని తలపించింది. ఓ ఎంపీ ఫైళ్లు లాక్కొని పార్లమెంట్ నుంచి బయటకు పరుగులు తీశాడు. సభలో గందరగోళానికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. శాసనసభ మెజారిటీ లేకున్నా అధ్యక్షుడిగా ఎన్నికైన చింగ్ తే బాధ్యతలు చేపట్టడానికి కొన్ని రోజుల ముందు ఈ ఘటన జరగడం గమనార్హం.

## భవిష్యత్తులో అమెరికా అధ్యక్ష పదవికి

# రో ఖన్నా పోటీ చేసే అవకాశం



వాషింగ్టన్: పాలక డెమోక్రటిక్ పార్టీకి చెందిన భారతీయ అమెరికన్ కాంగ్రెస్ సభ్యుడు రో ఖన్నా (47) మున్ముందు అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేసే అవకాశం ఉందని ఆయన సహచరులు భావిస్తున్నారు. వాషింగ్టన్‌లో గురువారం ఇండియన్ అమెరికన్ ఇంపాక్ట్ చర్చా వేదికలో ఏబీసీ విలేకరి జోహ్రీన్ షా భారత సంతతి అమెరికన్ కాంగ్రెస్ సభ్యులను... రో ఖన్నా అమెరికా అధ్యక్ష పదవికి పోటీచేసే విషయమై ఆరా తీయగా... 'అవునంటూ థానేదార్, ప్రమీలా జయపాల్ వ్యాఖ్యానించారు. సిలికాన్ వ్యాలీ నుంచి అమెరికా పార్లమెంటుకు ఎన్నికైన రో ఖన్నా, 'ఏమో ఎలా చెప్పగలం' అని అంటూనే... బహుశా ఒక దశాబ్ద కాలంలో అధ్యక్ష పదవికి 'పోటీ చేయవచ్చువని స్పందించారు. ఆయనకు తోడు చర్చలో పాల్గొన్న ముగ్గురు భారతీయ అమెరికన్ సభ్యులు కూడా సానుకూలమైన స్పందననే కనబరిచారు. "హక్కులపై భారత్‌కు పాఠాలు వద్దు" మానవ హక్కుల గురించి భారత దేశానికి ధర్మోపదేశాల వల్ల ఉపయోగం ఉండదనీ, దీనికి బదులు ఆ దేశ నాయకత్వంతో నేరుగా చర్చలు జరపడం ఎక్కువ ప్రయోజనకరమని భారతీయ అమెరికన్ పార్లమెంటు సభ్యులు అగ్రరాజ్య ప్రభుత్వానికి సూచించారు. నూరేళ్లపాటు వలస పాలనలో ఉన్న భారతదేశం ఇతర దేశాలు తనకు ఉపదేశాలు ఇవ్వడాన్ని అంగీకరించదని రో ఖన్నా వ్యాఖ్యానించారు. ఆయనతోపాటు శ్రీ థానేదార్, ప్రమీలా జయపాల్, డాక్టర్ అమీ బేరా కూడా ఈ అంశంపై మాట్లాడారు. వీరంతా పాలక డెమోక్రటిక్ పార్టీకి చెందినవారే.

# కిర్గిస్థాన్‌లో విదేశీ విద్యార్థులే లక్ష్యంగా మూక హింస.. కేంద్రం అలర్ట్

కిర్గిస్థాన్ దేశంలో అల్లర్లు చెలరేగాయి. అక్కడ విదేశీ విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని మూక హింస చెలరేగింది. కిర్గిస్థాన్, ఈజిప్ట్‌కు చెందిన విద్యార్థుల మధ్య మే 13వ తేదీన జరిగిన ఘర్షణకు సంబంధించి వీడియోలు శుక్రవారం వైరల్ కావడం దాడులకు దారి తీసింది. అక్కడ భారత్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ విద్యార్థులు నివసించే బిష్కెక్‌లోని కొన్ని వైద్య విశ్వవిద్యాలయాల హాస్టళ్లపై దాడి జరిగింది. ఈ దాడిలో పాకిస్థాన్‌కు చెందిన పలువురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక మీడియా నివేదించింది. మరికొంతమంది గాయాలపాలైనట్లు తెలిపింది.

ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. ఈ మేరకు కిర్గిస్థాన్‌లోని భారతీయ విద్యార్థులను అప్రమత్తం చేసింది. విద్యార్థులు ఎవరూ బయటకు రావొద్దని సూచించింది. ఈ మేరకు కిర్గిస్థాన్‌లోని భారత రాయబార కార్యాలయం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. 'మన విద్యార్థుల గురించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాం. ప్రస్తుతానికి పరిస్థితి ప్రశాంతంగానే ఉన్నప్పటికీ, విద్యార్థులు ఎవరూ బయటకు రావొద్దు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే ఎంబసీని సంప్రదించాలి' అని పేర్కొంది. ఈ మేరకు 24 గంటలపాటూ అందుబాటులో ఉండే ఫోన్ నంబర్‌ను షేర్ చేసింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం.. కిర్గిస్థాన్‌లో దాదాపు 14,500 మంది భారతీయ విద్యార్థులు నివసిస్తున్నారు.

మరోవైపు దాడుల నేపథ్యంలో పాకిస్థాన్ ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. అక్కడి పాక్ విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, బయటకు రావొద్దంటూ సూచించింది. బిష్కెక్‌లోని కొన్ని వైద్య విశ్వవిద్యాలయాల హాస్టళ్లు, పాకిస్థానీలతో సహా విదేశీ విద్యార్థుల ప్రైవేట్ నివాసాలపై దాడులు జరిగినట్లు తెలిపింది. అయితే, ఈ దాడిలో పాక్‌కు చెందిన విద్యార్థుల మరణాలు, గాయాలపై నివేదికలు వచ్చినప్పటికీ తమకు ఇప్పటి వరకూ ఎలాంటి సమాచారం అందలేదని తెలిపింది. పరిస్థితి సాధారణ స్థితికి



వచ్చే వరకూ విద్యార్థులు ఎవరూ బయటకు రావొద్దని పాక్ రాయబార కార్యాలయం తెలిపింది. ప్రస్తుతం మధ్య ఆసియా దేశంలో దాదాపు 10,000 మంది పాకిస్థానీ విద్యార్థులు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి.

# మృత్యుంజయులమే..

# మెదడు పాడవ్వకుండా కాపాడే క్రయోజెనిక్ ఫ్రీజర్!

- 'మేడీ' పేరిట రూపొందించిన చైనా వర్సిటీ శాస్త్రవేత్తలు
- మరణించిన వారికి ప్రాణం పోయాలన్న ఆశలకు ఊపిరి
- ఇప్పటికే బాడీ ఫ్రీజర్లకు ఆర్డర్ ఇచ్చిన ప్రపంచ కుబేరులు

చైనా : మరణించిన వారికి తిరిగి ప్రాణంపోయడానికి ప్రపంచవ్యాప్తంగా ఎన్నో పరిశోధనలు ఏండ్లుగా జరుగుతూనే ఉన్నాయి. అయితే, ఇప్పటివరకూ ఏదీ విజయవంతం కాలేదు. దీనికి ప్రధాన కారణాల్లో ఒకటి.. మరణించిన వ్యక్తి మెదడును కాపాడలేకపోవడమే. అయితే, చైనాలోని ఫుడాన్ వర్సిటీ పరిశోధకులు తాజాగా అభివృద్ధిచేసిన సరికొత్త క్రయోజెనిక్ ఫ్రీజర్ వ్యవస్థ.. మరణించిన వారికి ప్రాణం పోయాలన్న ఆశలకు కొత్త ఊపిరిని ఇస్తున్నది.

**ఏమిటీ వ్యవస్థ?**

అత్యంత తక్కువ ఉష్ణోగ్రతల వద్ద మెదడు కణజాలాన్ని గడ్డకట్టేలా చేసి, తిరిగి సాధారణ స్థితికి తీసుకొచ్చేలా చేయడానికి సాయపడే క్రయోజెనిక్ ఫ్రీజర్‌ను చైనాలోని ఫుడాన్ వర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. దీనికి 'మేడీ'గా నామకరణం చేశారు. మేడీ ఫ్రీజర్ నుంచి తీసిన అనంతరం మెదడులోని నాడీవ్యవస్థ పాడవ్వకుండా ఉండటమే కాకుండా గతంలో పనిచేసినట్టుగానే అన్ని విధులను నిర్వహిస్తున్నట్టు పరిశోధనలకు నేతృత్వం వహించిన ప్రొఫెసర్ చిచెంగ్ షో చెప్పారు.



**మెదడు ఎందుకంత ప్రత్యేకం?**

చనిపోయిన మనిషిలోని అన్ని అవయవాలను నిర్దిష్ట ఉష్ణోగ్రతలు ఉన్న క్రయోజెనిక్ ఫ్రీజర్లలో పెట్టి ఎన్నేండ్లయినా భద్రపరుచవచ్చు. అయితే, మెదడును అలా భద్రపర్చడం కుదరదు. దీనికి కారణం మెదడు కణజాలం 80 శాతం మేర నీరుతో నిండి ఉండటమే. ఒకవేళ, మెదడును సాధారణ బాడీ ఫ్రీజర్లలో పెట్టి భద్రపరిస్తే, మెదడు కణజాలంలోని నీరు గడ్డకట్టి నాడీవ్యవస్థ దెబ్బతింటుంది. ఉష్ణోగ్రతను సాధారణ స్థితికి తీసుకొచ్చినప్పుడు మెదడు మునుపటి విధులను నిర్వర్తించలేదు. దీంతో ప్రత్యేకమైన క్రయోజెనిక్ ఫ్రీజర్ అవసరం ఏర్పడింది.

**మేడీలో ప్రత్యేక రసాయనాలు**

మేడీలో మెదడును భద్రపర్చేప్పుడు మిథైల్‌సెల్యూలోజ్, ఇథైలిన్‌గ్లైకోల్, డీఎమ్ఎస్‌వో, వై27632 వంటి ప్రత్యేక రసాయనాలను తగుపాళ్లలో వినియోగించినట్టు ప్రొఫెసర్ చిచెంగ్ షో తెలిపారు. అందుకే మెదడు పాడవ్వలేదని పేర్కొన్నారు. కాగా, తాజా పరిశోధనతో మెదడును కూడా భద్రపరిచే సాంకేతికత అందుబాటులోకి వచ్చిందని శాస్త్రవేత్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరణించిన మనిషికి పునఃప్రాణం పోసే క్రతువులో ఇదో కీలక మైలురాయిగా అభివర్ణిస్తున్నారు.

**బాడీ ఫ్రీజర్లకు డిమాండ్**

మరణించిన తర్వాత తమ శరీరాన్ని భద్రపర్చుకోవడానికి ప్రపంచ కుబేరులు ఆసక్తి కనబరుస్తున్నారు. చనిపోయిన మనిషికి ప్రాణంపోసే సాంకేతికత అభివృద్ధి జరిగితే తాము మళ్లీ బతుకవచ్చన్న ఆశే వారిని ఇలా చేస్తున్నది. ఈ జాబితాలో పీటర్ తేయెల్ వంటి కుబేరులు, స్టీవ్ ఓకీ వంటి సెలబ్రెటీలూ ఉన్నారు. ఇప్పటికే వీళ్లు బాడీ ఫ్రీజర్లకు ఆర్డరిచ్చారు కూడా. కాగా, జీవంలేని శరీరాన్ని ప్రత్యేక ఫ్రీజర్‌లో భద్రపర్చాలంటే కనీసం రూ. 24 లక్షల వరకూ ఖర్చుచేయాల్సిందే.